



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఎ.కోరి

వచ్చే ఏడాది సొంత ప్రాంగణంలోకి..

మరిన్ని పీజీ కోర్సులు పెంచుతాం

కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్‌ఎ.కోరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వచ్చే ఏడాది సొంత ప్రాంగణంలోకి క్యాంపస్ మారుస్తామని కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్‌ఎ.కోరి పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాంపస్ ప్రస్తుతం జెఎన్‌టియు ఇంక్యూబేషన్ కేంద్రంలో నడుస్తున్నట్టు తెలిపారు. దీన్ని జంతలూరులో వద్దనున్న సొంత ప్రాంగణంలోకి వచ్చే ఏడాది మారే అవకాశమున్నట్టు తెలిపారు. ఇప్పటికే నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దశల వారీగా పరిపాలనా భవనం, హాస్టళ్లు, లైబ్రరీ వంటివన్నీ వచ్చేస్తాయని చెప్పారు. దీంతోపాటు యుజి, పీజీ కోర్సుల సంఖ్య కూడా క్రమంగా పెంచుతూపోతామన్నారు. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి ఇస్రోతోనూ అనుసంధానం చేయబడి ఉన్నట్టు తెలిపారు. యూనివర్శిటీలో ఈ ఏడాది యూజి, పీజీ కోర్సుల్లో 385 సీట్లకుగానూ 2.20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే 21 రాష్ట్రాల నుంచి 600 మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం అనుగుణంగా విద్యాబోధనను తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కరీంఖాన్ మాట్లాడుతూ 1997లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 25 సంవత్సరాలు పూర్తవుతోందన్నారు. ఎన్‌ఇపి విధానంలో ఇక్కడ కూడా విద్యా బోధన కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య రామిరెడ్డి, కేంద్రీయ విద్యాలయం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అదును దాటాక పదును

◆ జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం ◆ వేరుశనగ సాగుపై రైతుల్లో డోలాయమానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ పంట సాగుకు అదును దాటక పదునైంది. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు పడ్డాయి. బుధ,గురువారాలు రెండు రోజులూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడ్డాయి. భారీ వర్షాలు పడకపోయినా, మోస్తరు వర్షపాతం నమోదయింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1.4 మిల్లీమీటర్లు నమోదవగా సత్యసాయి జిల్లాలో 14.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం గురువారం నమోదయింది. ఈ రెండు రోజులు పడిన వర్షపాతంతో జులై ఆఖరు వరకు పడాల్సిన సాధారణ వర్షపాతానికి వర్షం చేరుకుంది. జూన్ నుంచి ఇప్పటి వరకు అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం 117.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 117.7 మిల్లీమీటర్లు నమోదయింది. సత్యసాయి జిల్లాలో 129.9 సాధారణ వర్షపాతం కాగా 107.7 మిల్లీమీటర్లు నమోదయింది. ఈ రెండు రోజుల వర్షాలతో ఇప్పటి వరకు 20 శాతానికిపైగా లోటున్న వర్షపాతం సాధారణ స్థితికి చేరింది.

సత్యసాయి జిల్లాలో కదిరిలో 35.2 మిల్లీమీటర్లు అత్యధికంగా వర్షపాతం నమోదయింది. కొత్తచెరువులో 32.2 మిల్లీమీటర్లు, పుట్టపర్తిలో 29.2 మిల్లీమీటర్లు, నల్లమాడలో 24.6 మిల్లీమీటర్లు, ధర్మవరం 22.6మిల్లీమీటర్లు, బుక్కపట్నంలో 21.4 మిల్లీమీటర్లు నమోదయింది. ఇక అనంతపురం జిల్లాలో డి.హీరేహాళ్‌లో అత్యధికంగా నమోదయింది. బొమ్మనహాల్‌లో 36.4 మిల్లీమీటర్లు గుత్తిలో 36.4 మిల్లీమీటర్లు, ఉరవకొండలో 35.2 మిల్లీమీటర్లు, విడపనకల్లులో 34.4 మిల్లీమీటర్లు నమోదయింది. ఇతర ప్రాంతాల్లోనూ చిరుజల్లులు పడ్డాయి. గుమ్మగట్టలో అత్యల్పంగా 2.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.



అదును దాటాక పదునుతో రైతుల్లో అయోమయం

వేరుశనగకు విత్తనం విత్తుకునే సమయం దాటాక పదును కావడంతో ఏ పంటలు సాగు చేసుకోవాలన్న అయోమయం రైతుల్లో నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యేది వేరుశనగ పంటయే. జూన్ ప్రారంభం నుంచి జులై 15వతేదీ లోపు అనువైన సమయంగా రైతులు భావిస్తారు. ఆ తరువాత వర్షాలొచ్చి పంట సాగు చేసినా దిగుబడులు పెద్దగా రావన్నది రైతుల నమ్మకం. ఇటువంటి పరిస్థితుల్లో సీజన్ దాటక వర్షపాతం నమోదయింది. ఇప్పటి వరకు చూస్తే అనంతపురం జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 9.15 లక్షల ఎకరాలవుతే అందులో ఇప్పటి వరకు విత్తనం పడింది కేవలం 2.62 లక్షల ఎకరాల్లోనే. 29 శాతం సాగు భూమి మాత్రమే సాగైంది. ఇందులో ప్రధాన పంట అయిన వేరుశనగ సాధారణ సాగు 5.71 లక్షల ఎకరాలయితే ఇప్పటి వరకు సాగైంది 1.23 లక్షల ఎకరాల్లో మాత్రమే. ఇక పత్తి పంట 1.27 లక్షల ఎకరాలయితే 65 వేల ఎకరాల్లోనే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు ఏడు లక్షల ఎకరాలయితే ఇప్పటి వరకు విత్తనం పడింది 1.35 లక్షల ఎకరాలే. 19 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులో వేరుశనగ 5.08 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే 1.04 లక్షల ఎకరాల్లోనే సాగైంది. 21 శాతం సాగైంది. ఇతర పంటలు అదే పరిస్థితి నెలకొంది.



స్లిప్ లు చూపుతూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

స్లిప్‌లు ఇచ్చి రేషన్ ఎగ్గొట్టారు..!

మూడు నెలలుగా ఇదే తంతు

రేషన్ ఇవ్వలేదంటూ కార్డుదారుల ఆందోళన

ప్రజాశక్తి-చిలమత్తూరు

గత మూడు నెలలుగా తమ వద్ద వేలి ముద్ర వేయించుకుని ఎండియు ఆపరేటర్ రేషన్ సరుకులు ఇవ్వలేదంటూ చిలమత్తూరు మండలం గొల్లపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో దాదాపు 120 రేషన్ కార్డులు ఉన్నాయని అయితే ప్రతి నెలా ఇదే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల నుంచి తమ గ్రామంలో నెట్‌వర్క్ రాదంటూ ఊరిబయటకు పిలిపించి బరువు పెట్టి వేలిముద్ర వేయించుకుని స్లిప్‌లు ఇచ్చి రేషన్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్నాడని తెలిపారు. ప్రతి నెలా ఇదే పరిపాటిగా మారిందని అన్నారు. తమకు రేషన్ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీస్తే నేను ఇచ్చేదే లేదు ఎవరికైనా చెప్పుకోండి అని బెదిరించినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీఆర్వోకి చెప్పినా ప్రయోజనం లేదు

రేషన్ ఇవ్వని విషయంపై గత మూడు నెలల నుంచి వీఆర్వో శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తునే ఉన్నామని గొల్లపల్లి గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ ఏ మాత్రం స్పందించలేదన్నారు. బియ్యం అందక తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వీఆర్వో తానేంచేయలేనని విధంగా మాట్లాడుతున్నాన్నారు. తహశీల్దార్ వద్దకు వెళ్తే తాను మాట్లాడతానని చెప్పడం తప్పా, సమస్యను పరిష్కరించింది లేదన్నారు.

డీలర్ వద్ద లేని స్టాక్

ఎండియు ఆపరేటర్ శబరీని వివరణ కోరగా తాను వేలిముద్ర చేయించుకుని స్లిప్‌లు ఇచ్చిన మాట వాస్తవమేనని అయితే ఉన్న స్టాక్‌ను వారికి అందజేస్తానని వివరణ ఇచ్చాడు. వై.గొల్లపల్లికి సంబంధించిన యగ్నిశెట్టిపల్లి గ్రామంలోని డీలర్ షాప్‌ను పరిశీలించగా అక్కడ స్టాక్ లేకపోవడం కొసమెరుపు బియ్యంకు డిమాండ్ పెరగడం, కర్నాటకకు దగ్గరలో ఉండటంతో ఈ రేషన్ బియ్యం కర్నాటక రాష్ట్రానికి తరలిపోతున్నాయ అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



అధికారులకు సమస్యను వివరిస్తున్న సిఐటియు నాయకులు

ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ

పోరాడుతాం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేంత వరకు పోరాడుతామని వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ స్పష్టం చేశారు. అహుడా జగనన్న స్మార్ట్ సిటీ(ఎంఐజి) లేఅవుట్‌లో 4 రోజుల నుంచి ప్రజలు గుడిసెలు వేసుకు న్నారు. అయితే గురువారం అహుడా అధికారులు అక్కడికి చేరుకొని లేఅవుట్ హద్దులను ఏర్పాటు చేస్తుండగా నాయకులు, ప్రజలు అడ్డుకుని లే అవుట్ స్థలాన్ని సర్వే చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సర్వే చేయిస్తామని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తిరిగి అహుడా అధికారి చెన్నయ్య, తహశీల్దార్ స్వర్ణలత, కమిషనర్, ఎస్‌ఐ రమేష్, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకోగా ప్రజలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ సక్రమంగా సర్వే చేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్య.క.సం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, ఉత్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల మధ్య జెసిపిఆర్ ఆందోళన విరమణ

◆ ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి వెంట రాగా ఛాంబర్లోకి అడుగుపెట్టిన మున్సిపల్ కమిషనర్ ◆ మున్సిపల్ కమిషనర్, డిఈపై ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

గత ఐదు రోజులుగా టిడిపి కౌన్సిలర్ల నిరసనతో తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో స్తంభించిన పాలనా కార్యకలాపాలు గురువారం మధ్యాహ్నం నుంచి యథావిధిగా కొనసాగాయి. ఉద్రిక్తతల మధ్య టిడిపి మాజీ ఎమ్మెల్యే, స్థానిక మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి తన ఆందోళనను విరమించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఈనెల 20న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పలు శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో మున్సిపల్ కమిషనర్ ప్రోటోకాల్ పాటించడం లేదని డాక్టర్లే లేని ఆరోగ్య కేంద్రాన్ని ఉన్నపాటుగా ప్రారంభించడానికి గల కారణాలను తెలియజేయాలని టిడిపి కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నిస్తూ గత ఐదు రోజుల నుంచి నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి కూడా టిడిపి కౌన్సిలర్ల నిరసనలో భాగస్వాములయ్యారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆందోళన కొనసాగించిన జేసి.ప్రభాకర్ రెడ్డి ఆరోజు రాత్రి కూడా మున్సిపల్ కార్యాలయంలోనే నిద్రించారు. గురువారం ఉదయం అక్కడే కాలకత్యాలు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా టిడిపి కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్ ఎదురుగా బైటాయించి నిరసన కార్యక్రమం చేపట్టడం ద్వారా తన విధులకు ఆటంకం కలుగుతోందని కమిషనర్ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇలా బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు జెసి ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలోనే బస చేసి ఆందోళన కొనసాగించడం, టిడిపి కౌన్సిలర్ల నిరసన కొనసాగుతుండగానే గురువారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి వెంటరాగా మున్సిపల్ కమిషనర్ ఎట్టకేలకు ఆయన ఛాంబర్లోకి వచ్చారు.మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కమిషనర్ ప్రభాకర్ రెడ్డి దగ్గరికి వెళ్లారు. హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. ఆగస్టు నెలలో కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న మటన్ మార్కెట్‌కు సంబంధించి టెండర్లు జరగనుండగా అక్కడ ఏర్పాటు చేసిన మటన్ మార్కెట్ స్థలం చాలా విలువైనదని అందులో మటన్ మార్కెట్ నిర్మించడానికి ఎలా అనుమతి ఇచ్చారని కమిషనర్‌ను ప్రశ్నించారు. అడిగిన వాటికన్నిటికీ సమాధానం చెప్తేనే తాను నిరసన విరమిస్తానని అంతవరకు మున్సిపల్ కార్యాలయంలోనే తమ కౌన్సిలర్లతో కలసి నిరసన చేస్తామని ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆగస్టు 8వ తేదీన మార్కెట్ వేలానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తామని అధికారులు ప్రభాకర్‌రెడ్డికి తెలిపారు. అధికారుల హామీతో టిడిపి కౌన్సిలర్లు, జెసి.ప్రభాకర్ రెడ్డి దీక్ష విరమించారు.ప్రస్తుతం తాత్కాలికంగా ఆందోళన విరమించినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ వేలంపాటలు నిర్వహిస్తే వదిలిపెట్టనని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.



ప్రొటోకాల్‌పై కమిషనర్, డిఇని ప్రశ్నిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి



త్యాగరాజ ఆరాధనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గుండుమల, తదితరులు

1న త్యాగరాజు ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఆగస్టు 1వ తేదీ టిడిపి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహి స్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి మహోత్సవ కరపత్రాలను గురువారం పట్టణంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ త్యాగరాజ ఆరాధనోత్సవాలకు జిల్లా వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, సంఘం నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడ్డ కొండచరియలు

కొత్తచెరువు రూరల్: గోరంట్ల ధర్మవరం ప్రధాన రహదారిలో నాగల కనుమ వద్ద కొండచరియలు విరగడంతో పెద్ద పెద్ద బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దాంతో గురువారం కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రయాణికులు, వాహనాలు, లేని కారణంగా ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అధికారులు స్పందించి కొండపై నుండి ఊడిపడే బండరాలను గుర్తించి ముందస్తు చర్యలలో భాగంగా వాటిని తొలగిస్తే ప్రమాదాలు తప్పుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పచ్చదనం అభివృద్ధికి కృషి

కొత్తచెరువు : భవిష్యత్ తరాల కోసం నేటి విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించడంలో, వాటి విశిష్టతను తెలుసుకోవడంలో ప్రముఖ భూమిక పోషించాలని డీఈవో మీనాక్షి, పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు శనివారం కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి మనుషులకు ఏమిస్తుంది అన్న విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎడి రామకృష్ణ, ఎంఇఒ జయచంద్ర నాయుడు, హ్యూమన్ రైట్స్ సభ్యులు నితీష్ మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

డ్రైయినేజీ నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల : పట్టణంలోని సంత మార్కెట్ వీధిలో గొర్రెల బాషా ఇంటి నుంచి రావికుంట చెరువు వరకూ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి గురువారం సర్పంచి సరోజనాగేనాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వార్డు ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అన్సర్, సుభాన్ సాబ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్వాతి, పాల్గొన్నారు.

తెగుళ్లు సోకిన పంటల పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల తెగులు సోకిన పంటలను పరిశీలించేందుకు పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త డాక్టర్ రవికిషోర్ గురువారం మడకశిర, గుడిబండ, మండలాల వ్యవసాయ అధికారులతో కలిసి పర్యటించారు. అందులో భాగంగా గుడిబండ మండలంలోని నాచే పల్లి, మడకశిర మండలంలోని నీలకంఠాపురంలో రైతులు సాగుచేసిన పత్తి, రాగి, మొక్కజొన్న, వేరుశెనగ పంట లను పరిశీలించారు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధిక తేమ ఉండడంతో పత్తిలో ఆకు ముడత, ఆకుమచ్చ తెగులు, రాగి పంటలో అగ్గి తెగులు, మెడ విరుపు, మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించిందని గుర్తించారు. అలాగే వాటి నివారణకు పిచికారి చేయాల్సిన పురుగు మందుల గురించి వివరించారు. వారి వెంట గుడిబండ, మడకశిర ఎఒలు వీరనరేష్, తిమ్మప్ప, ఆర్‌బికె అధికారి నరసింహమూర్తి, దివ్య, రైతులు ఉన్నారు.



తెగులు సోకిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఉపాధి పనుల సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

గోరంట్ల : మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై గురు వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా మాట్లా డుతూ గతేడాది జరిగిన ఉపాధి హామీ పనులపై ఖర్చు చేసిన నిధులకు సంబంధించి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూ ఎస్, ఎస్‌ఎస్‌ఎలో జరిగిన పనులపై డిపార్ట్‌మెంట్లకు సంబంధించి పనులను సామాజిక తనిఖీ బందం తనిఖీ చేస్తుందన్నారు. డిఆర్పీలు గ్రామ పంచాయతీకి వెళ్లి పనులపై ఖర్చు చేసిన వాటిపై తనిఖీ చేసిన తర్వాత గ్రామసభ నిర్వహిస్తామన్నారు. పంచాయతీల వారిగా తనిఖీలు పూర్తయిన తర్వాత మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎపిఒ వరప్రసాద్, మోహన్‌బాబు, ఇంజినీర్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

'ఇంటింటి ఓటరు సర్వే'కి సహకరించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పెనుకొండ

ఇంటింటికీ ఓటరు సర్వేకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సబ్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. హౌస్ టూ హౌస్ ఓటరు సర్వేపై గురువారం ఆయన రాజకీయపార్టీల ప్రతినిధులతో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు సర్వేలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు హౌస్ టూ హౌస్ వెళ్లి పరిశీలిస్తారని తెలిపారు. సర్వేలో ఏమైనా లోటుపాట్లు ఉంటే తెలపాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఎఈఆర్ ఓలు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బి.హనుమంతు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సి.గణేష్‌కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ షాషావలి, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు, రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కె.కార్తీక్, హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

రెడ్డిపల్లిలో సొంతంగా రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి-రొద్దం


మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం నుంచి కర్నాటకలోని సుంకార్లకుంటకు వెళ్లే దారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైంది. దీంతో రైతులు, పశువులు, గొర్రెల కాపరులు ఈ దారిలో రాకపోకలు సాగించడా నికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గ్రామస్థులు సొంగంగా పోగు చేసిన రూ. 15 వేలతో గురువారం ఆ రహదారిలో దాదాపు కిలోమీటర్ మేర గరుగు మట్టితో మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి విజయభాస్కర్‌రెడ్డి, రఘు, గోపాల్‌రెడ్డి, నారాయణప్ప, ఆదిరామప్ప, గంగప్ప, ఈశ్వరప్ప, జెసిబి చంద్ర, కెఎస్ రామాంజి, ఆటో కదిరప్ప, హరిజన నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



గరుగు మట్టి వేసి రహదారిని బాగు చేసుకున్న గ్రామస్తులు

అబ్దుల్ కలాంకు నివాళి

పెనుకొండ : భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు హరి, మాజీ సర్పంచి శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఘనగిరి ఇలియాజ్, రవూఫ్, రామాంజనేయులు, మాధవనాయుడు, వెంకటేశులు, పాదయాత్ర నటేష్, నరసింహ, బాషా, తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


ఆర్. కృష్ణయ్యతో బత్తల హరిప్రసాద్, వెంకటరమణ

ఆర్. కృష్ణయ్యను కలిసిన 'బత్తల'

కదిరి టౌన్ : రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యను వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల సమస్యలపై వారు చర్చించారు. బీసీలకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్ గురించి, వాటి చట్టబద్ధత గురించి రాజ్యసభలో ప్రస్తావించాలని కోరారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

ముదిగుబ్బ : మండలంలోని పలు గ్రామాల్లో ఫీవర్‌సర్వేను అధికారులు చేపట్టారు. మండలంలోని దొరిగల్లు గ్రామంలోని ఒకటవ వార్డులో ఫీవర్ సర్వేను బుధవారం నిర్వహించారు. హైస్కూల్‌లో బాల బాలికలకు ఐరన్ టాబ్లెట్లు ఇవ్వడం జరిగింది. ప్రతి ఇంటి వద్ద వున్న వారికి ఆరోగ్య విద్య బోధనలో భాగంగా ప్రతిరోజు రాత్రివేళ వేపాకు పొగ వేసుకోవాలని మరియు చిన్న పిల్లలకు పూర్తిగా దుస్తులు కప్పి ఉంచే విధంగా ధరింపజేయాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో పాత టైర్లు టెంకాయ చిప్పలు పనికిరాని డబ్బాలు లాంటివి నిర్మూలించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని బాత్రూం లో గల తొట్టెలు, బానలు కడిగి ఆరబెట్టి నీటిని పట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ హెల్త్ క్లినిక్ సిహెచ్ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, హెల్త్ సెక్రటరీ చక్రి, ఆశా కార్యకర్త ఉమా, వాలంటరీ భారతి పాల్గొన్నారు.

నేడు మహాశక్తి ప్రచారరథం ప్రారంభం

కొత్తచెరువు రూరల్: మండల పరిధిలోని కేశపురం గ్రామంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో మహాశక్తి ప్రచార రథం శుక్రవారం ప్రారంభించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు . ఉదయం 10 గంటలకు కేశపురం లోని ఆంజనేయస్వామి దేవాలయంలో మహాశక్తి ప్రచార రథం పూజలు నిర్వహించి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కావున మండలంలోని తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పీర్ల చావిడి మరమ్మతులు

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలో సర్పంచి కళావతి తన సొంత నిధులతో పీర్ల చావిడి మరమ్మతులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొహరం సందర్భంగా పీర్ల చావిడికి దాదాపు 40 వేల రూపాయలతో మరమ్మత్తులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. గ్రామంలో మొహరం ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి చలపతి, ఆర్టీసీ డ్రైవర్ రమణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమానుల్లా, విశ్రాంతి వీఆర్వో రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా చిన్నసరిగెత్తు

ధర్మవరం టౌన్ :మొహరం ఉత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని కొత్తపేటలో చిన్నసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసానవలీ, ఇమాంకాశీం, షాషావలి, దూద్వేరా స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించుకున్నారు.

కరపత్రాలు పంపిణీ

కొత్తచెరువు : మిషన్ రాయలసీమకరపత్రాలను టిడిపి నాయకులు కొత్తచెరువులో గురువారం పంపిణీ చేశారు. తెలుగు యువత ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ కూడలి, వారపు సంత,మెయిన్ బజారు మరియు,మెకానిక్ షాపులు, టీ కొట్ల వద్ద, జనసమూహం ఉన్న చోట మిషన్ రాయలసీమ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బూదిలి ఓబులరెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర, వైవి మురళి, బొల్లె సుధీర్ పాల్గొన్నారు

అబ్దుల్ కలాం వర్ధంతి

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల రాముడు, బాబు రమణ, మస్తాన్ పీరా, బాదుల్లా, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి జయరాం అన్నారు. గ్రంథాలయంలో అబ్దుల్‌కలాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పాఠకులు మహమ్మద్, ప్రభాకర్, రఫీ,మహేష్, రామాచారి తదితరులు పాల్గొన్నారు

పది, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారిని మీనాక్షి కోరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023- 24 సంవత్సరానికి గాను పదవ తరగతిలో అడ్మిషన్ పొందడానికి 14 సంవత్సరాలు వయసు వారు అర్హులని, ఇంటర్లో ప్రవేశానికి 15 సంవత్సరాలు వయసు వారు అర్హులని ఆమె తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 31వ తేదీ చివరి తేదీ అని చెప్పారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌ను సంప్రదించవచ్చునని వెల్లడించారు.

'విదేశీ విద్యాదీవెన'తో పేదవిద్యార్థులకు ఉన్నత విద్య



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విదేశీ విద్య దీవెన పథకం క్రింద జిల్లాలో నలుగురు విద్యార్థులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ తో పాటు మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ పథకం క్రింద జిల్లాకు రూ. 44,36,627లు మంజూరు కాగా ఈ మొత్తానికి సంబంధించిన మెగా చెక్కును కలెక్టరు, ప్రజా ప్రతినిధులు విడుదల చేశారు. సివిల్ ఇంజనీర్ ఇటలీలో చేస్తున్న ఒడిసి మండలం అల్లాపల్లికి చెందిన అనిత విద్యార్థిని, న్యూయార్క్‌లో విద్యనభ్యసిస్తున్న హిందూపురానికి చెందిన విష్ణు సాయి రాయల్, న్యూయార్క్ లో ఇంజనీరింగ్ చేస్తున్న కొత్తచెరువు చెందిన రాజశేఖర్ రెడ్డి, న్యూయార్క్ యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ విద్యను అభ్యసిస్తున్న పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన భార్గవి సాయి విద్య దీవెన క్రింద ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఈనెల 21వతేదీ నుండి జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం విద్యార్థిని ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ధర్మాంభ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మీయట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికైన నిత్యను గురువారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాల బాస్కెట్‌బాల్ కోర్టులో శెట్టిపి జయచంద్రారెడ్డితోపాటు అసోషియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ తదితరులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ఈనెల 28వ తేదీనుండి ఆగస్టు 2వరకు చిత్తూరులోని శిక్షణాశిబిరంలో పాల్గొని ఆ తరువాత ఆగస్టు 3వతేదీ నుండి పుదుచ్చేరిలో జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటుందని అసోషియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణితో అసోసియేషన్ నాయకులు



ప్రతిభా విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతిభా విద్యార్థులకు సన్మానం

కదిరి టౌన్ : నీట్, ఐఐటిలో రాంకులు సాధించిన విద్యార్థులను యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక వేమారెడ్డి కూడలి లోని ఎన్జీవో హోంలో యుటిఎఫ్ కదిరి జోన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీట్, ఐఐటిలో ప్రతిభ కనబరిచిన యుటిఎఫ్‌లోని సీనియర్ కార్యకర్తల పిల్లలకు ఆణిముత్యాలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి .సుబ్బారెడ్డి, వింధ్యరాణి కుమార్తె వై. అశ్రిత, డి . శ్రీనివాసులు, వీణ కుమారి కుమారుడు డి .చరితేష్ , ఇర్ఫాన్‌బాషా, పాహిమున్ కుమార్తె ఫసిహ బుష్రా , రవివర్ధన్ రెడ్డి హేమలత కుమార్తె సాహితీ, ఎం సుధాకర్, నిర్మల కుమారుడు ఎండి. కులదీప్‌ఈశ్వర్, లక్ష్మీ ప్రసాద్ , రాజ్యలక్ష్మి కుమార్తె యోజిత లకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. . ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, మున్సిపల్ హైస్కూల్ వీవర్స్ కాలనీ ప్రధానోపాధ్యాయులు నాగరాజు, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు మైనుద్దీన్, హనీఫ్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు జంషీద్, యుటిఎఫ్ కదిరి ప్రాంత కుటుంబ సభ్యులు మల్లికార్జున, రమణ నాయక్, ఆజం భాష, ఖాజా మొయినుద్దీన్ , సునీల్, మనోహర్, సురేష్, షబానా, భార్గవ, జబివుల్లావివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య విద్యను వ్యాపారం చేయడం సిగ్గుచేటు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

వైద్యవిద్యను వ్యాపారం చేయడం సిగ్గు చేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి విమర్శించారు. గురువారం పట్టణంలోని బీసీ వసతి గృహంలో ఆయన మాట్లాడుతు వైద్య విద్య సీట్ల భర్తీలో విద్యా వ్యాపారానికి ఎర్రతివాచి పరిచి బలహీన వర్గాల విద్యార్థులను వైద్యవిద్యకు ప్రభుత్వం దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ఐదు వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుని, నేడు ఆ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా తయారుచేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 107, 108 జీవోల ద్వారా ఇది తేటతెల్లమవుతోందన్నారు. మూడు కేటగిరిలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కేటాయించడంతో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. 25శాతం సీట్లను మాత్రమే రిజర్వ్ సీట్లును కేటాయించడం ఏమటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం తెలంగాణలో నూతన కళాశాలలు ప్రారంభిస్తున్నా కన్వీనర్ కోటాలోనే సీట్లను భర్తీ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యలో విప్లవాత్మమైన మార్పులు చేస్తున్నారంటే అది బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమేనా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబ్బు ఉన్నవాడికి పేద వాడికి వార్ జరుగుతుందని చెప్తున్న సిఎం సీట్ల కేటాయింపుతో ఎవరి పక్షమో ప్రజలకు అర్థమైందన్నారు. వెంటనే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్యకై కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, జయచంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. గురువారం తన ఛాంబర్‌లో క్లాప్, యూజర్ ఛార్జీలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. శానిటేషన్ సెక్రటరీలు నివాస ప్రాంతాలకు రోజుకు రూ.1000, వాణిజ్య ప్రాంతాల నుంచి రోజువారీ రూ. 5,000 వసూలు చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం 5:30 లోపు మస్టర్‌కు హాజరు కావాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిరోజు పట్టణ వ్యాప్తంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని, ప్రతిరోజూ మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని పలువార్డుల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు.


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్, తదితరులు

సంక్షేమపథకాలకు పార్టీల రంగు పూస్తారా.?

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలు అందిస్తున్నామని ఒక పక్క గొప్పలు చెప్పుకుంటూ మరో పక్క పథకాలకు పార్టీల రంగులు పూస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. పట్టణంలోని 17వ వార్డులో గురువారం టీడీపీ నాయకులతోకలిసి పరిటాల శ్రీరామ్ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మ్యానిపేస్టో పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, కాచర్లకంచన్న, రాంపురం శీన, లక్ష్మీనారాయణ, అంబటిసనత్, రాళ్లపల్లి షరీఫ్, అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

వేగవంతంగా రైల్వేరోడ్డు విస్తరణ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోనే చేపట్టిన రైల్వే రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం తన చాంబార్ లో పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో రైల్వే రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా భవనాలు కోల్పోతున్న యజమానులకు వెంటనే నోటీసులను అందించి, నష్టపరిహారం కింద అందించే చెక్కులను ఇవ్వాలని ఆదేశించారు. 30 సంవత్సరాలుగా పుర ప్రజలు ఎదురు ఎదురుచూస్తున్న రైల్వే రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు ఇప్పటికే రూ.85.23లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాగా రోడ్డుకు ఇరువైపులా విస్తరణలో తొలగించాల్సిన భవనాలు ఇంకా తొలగించక పోవడంతో పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. అనుకున్న గడువులోగా పనులు పూర్తి కావాలంటే అధికారులు వారికి కేటాయించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘంలో ఉన్న అంతర్గత రహదారుల్లో అత్యంత రద్దీగా ఉండే అంతర్గత రహదారి రైల్వే ఫీడర్ రోడ్డు అని ఈ రోడ్డు విస్తరణ పనులను ఎప్పుడు చేపడతారని హిందూపురం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రైల్వే రోడ్డు అభివృద్ధిలో భాగంగా హిందూపురం పట్టణం అహూడా పరిధిలో ఉండడంతో రైల్వే రోడ్డు అభివృద్ధి కోసం రూ. 2 కోట్లు మంజూరు చేయాలని ఇప్పటికే లేఖ రాసినట్లు చెప్పారు. ఆ నిధులు వచ్చిన వెంటనే నూతనంగా రైల్వే రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు డివైడర్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి హిందూపురం పురపాలక సంఘంలోనే ఒక మోడల్ రోడ్డు గా తీర్చి దిద్దడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఇంజనీర్లతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం

పుట్టపర్తి అర్బన్ : జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విరివిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపుదలకు జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, పాఠశాలలో, అంగనవాడీ కేంద్రాలలో, సచివాలయాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. సమీపంలోని నర్సరీల నుంచి మొక్కలు తెచ్చుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఒక రోజుతో కాకుండా వీలైనప్పుడల్లా నాటడమే గాక వాటిని పరిరక్షించాలన్నారు. ముఖ్యంగా మహిళలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు, సచివాలయాల కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్రస్థాయి సహాయకులు, ఐసిడి ఎస్, ఎంపీడీవోలు, డ్వామా, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మండేపూరి పురుషోత్తం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన పుట్టపర్తికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిసి బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్‌క్యాస్ట్‌గా ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు బీసీలకు పెద్దపీట వేశారన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ గా కుమ్మరుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ జిల్లా కమిటీ సభ్యులను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. కమిటీ సభ్యులుగా పరిగి కుమ్మరి నాగరాజు, బత్తలపల్లి వెంకటరమణ, గుడిబండ నాగమ్మ, సోమందేపల్లి వెంకటనారాయణ లను ఎంపిక చేశామని ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మల జ్యోతి, కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ బీసీ శాఖ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ ట్యాంకర్ బోల్తా

చిలమత్తూరు : మండలంలోని 44 వ నెంబరు జాతీయ రహదారి ఆంజనేయతండా సమీపంలో కెమికల్ కంటైనర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. బెంగళూరు వైపు నుండి వస్తున్న కంటైనర్ అతివేగంగా రావడంతో అదుపుతప్పి బోల్తా పడింది.. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు..కాగా ట్యాంకర్లో ఉన్న కెమికల్ లీక్ అయినప్పటికి వాహనం రోడ్డు పక్కకు పడటంతో పెను ప్రమాదం తప్పింది.

మణిపూర్ నిందితులను శిక్షించాలి

కదిరి టౌన్ : మణిపూర్ లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కదిరి డివిజన్ కార్యదర్శి ఇలియాజ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ దారుణాలకు పాల్పడుతున్న కారకులపై చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలనీ డిమాండ్ చేశారు. మణిపూర్లో ఇంటర్ నెట్ బంద్ చేయించి దాదాపు75 రోజులపాటు ద్యూటీలు, గృహదహనాలు, అత్యాచారాలు, హత్యలు జరిగిన తర్వాత మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటన సోషల్ మీడియాలో చూసి యావత్తు ప్రపంచం విస్తుబోయిందన్నారు. దాదాపు150పైగా చర్చీలు అగ్నికి ఆహుతి చేశారు. వేలాది కుకీ జాతి ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. వందలాదిమంది గ్రామాలు వదిలి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల ఇళ్లు కాల్చివేశారు, ఇంతదారుణం జరుగుతున్నా సాక్షాత్తు మణిపూర్ ముఖ్యమంత్రి ఇటువంటి ఘటనలు వందల్లో జరిగాయని చెప్పడం సిగ్గుచేటు అన్నారు., స్వాతంత్ర్య యోధుడి భార్యను,కార్గిల్ యుద్ధవీరుడి భార్యను సజీవంగా అగ్నికి ఆహుతి చేసిన ఫాసిస్టు శక్తులను తక్షణమే అరెస్టు చేయాలని బాధితులకు సహాయ పునరావాసం కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్ రాయలసీమ మహిళా సంఘం శ్రీ సత్య జిల్లా కార్యదర్శి కె సుగుణమ్మ కదిరి డివిజన్ కార్యదర్శి రాజేష్ అధ్యక్షులు నవీన్ కుమార్ మనీ గంగాద్రి గంగన్న తదితరులు పాల్గొన్నారు

మండల మీట్ వాయిదా

ముదిగుబ్బ : స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమాశానికి ఎంపిడిఒ గైర్హాజరు కావటంతో మండలమీట్‌ను వాయిదా చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ఆదినారాయణయాదవ్ మాట్లాడుతూ ఎంపీడీవో విజయలక్ష్మి మండలమీట్‌కు రాకపోతే తాము సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశాన్ని వారు బాయ్‌కాట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఖాదర్‌బాషా, , వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణమ్మ జెడ్పిటిసి తిరుమల సేవేనాయక్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా మొహరం వేడుకలు

బత్తలపల్లి : మొహరం వేడుకలను జనజీవనానికి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ టీవీ శ్రీహర్ష సూచించారు. గురువారం రాత్రి మండలంలోని గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, యర్రాయపల్లి, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం గ్రామాలలో వారు పర్యటించారు. మొహరం వేడుకల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని ఎలాంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం, శనివారం జరిగే పెద్ద సరిగెత్తు, జలిది కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామాలలో మద్యం అమ్మకాలు జరిగినట్లు తమ దృష్టికి వసే_కఠిన చర్యలుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కొత్తచెరువు : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాలకు చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. హరితవనం కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువులోనిశ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో గురువారం మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పచ్చదనం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. చెట్లను నాటడం వలన కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్ కుమార్ రెడ్డి, డీన్ హనుమంతు, ఏవో కేశవరెడ్డి, నాగరాజు, గోపాల్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీపై అవగాహన

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని చెర్లోపల్లి, కంబాలపర్తి గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు గురువారం నిర్వహించారు. ఈ మేరకు పార్టీ నాయకులు మహాశక్తి చైతన్య రథయాత్రలో భాగంగా ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ లోని సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, దేవానంద రెడ్డి, కె బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, మహిళా నాయకురాలు మాధవి, రాధమ్మ, చెన్నకృష్ణమ్మ, మౌనిక, భూనాథ్, కులశేఖర్, జైపాల్ రెడ్డి, వేమన్న, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలతో రైతులకు ప్రయోజనం

హిందూపురం : ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలతో రైతులకు ఎంతో ప్రయోజనకరమని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలాజీ ట్రేడర్స్, సప్తగిరి ట్రేడర్స్, బందావన్ ట్రేడర్సును కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా మార్చడంతో వాటిని వ్యవసాయాధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన పనిముట్లు సరసమైన ధరలకే అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన యంత్రాలు, డ్రోన్లు సబ్సీడితో రైతులకు అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయానికి సంబంధించిన మట్టి పరీక్షలు, విత్తన పరీక్షలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం ఇంటర్నెట్ సదుపాయంతో రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సురేంద్ర నాయక్, నాయకులు మేడికుర్తి హరి, చంద్రశేఖర్, వరప్రసాద్, ఆదర్శకుమార్, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, భాగ్యలక్ష్మీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

పుట్టపర్తి రూరల్: ఇంటింటి సర్వేపై రాజకీయ పార్టీ నాయకులతో ఆర్డీవో భాగ్యరేఖ వారాంతపు సమావేశాన్ని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నెల రోజులు పాటు బూత్ స్థాయి అధికారుల చేత నిర్వహించిన ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన సర్వే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ కె.నవీన్ కుమార్, డివిజనల్ పరిపాలన అధికారి జిలాని, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ కె .నర సింహులు, సీనియర్ సహాయకులు తరుణ్ తేజ్, హరి,రహిమాన్, సిపిఎం గంగాధర్, బిజెపి విజయ్‌భాస్కర్‌రెడ్డి, టిడిపి విజయ్ కుమార్, రంగారెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళా పోరుయాత్రను జయప్రదంచేయండి

ఓబుల దేవర చెరువు : జులై 28 నుండి ఆగస్టు 9 వరకు నిర్వహించే మహిళా పోరు యాత్రను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు పోరు యాత్రకు సంబందించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై హత్యలు, అత్యాచారాలు రోజురోజుకీ విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయటానికి నిపుణులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. మద్యం మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు నాయకులు రమణ, కుల్లాయప్ప, అంగన్వాడీ సెక్టార్ లీడర్లు మణిమాల, ఆశీర్వామ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 477 మిల్లీమీటర్ల వర్షపాతం

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షానికి 477 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల జిల్లాలో అన్ని మండలాలలో ఒక మోస్తారు వర్షం పడింది. అత్యధికంగా కదిరిలో 55.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అగళిలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పుట్టపర్తిలో బుధవారం కురిసిన వర్షాలకు స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో నీరు చేరింది. పలు రహదారులలో నీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



మిషన్ రాయలసీమ డిక్లరేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మిషన్ రాయలసీమ డిక్లరేషన్ పత్రాలు పంపిణీ

గోరంట్ల : టిడిపి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మిషన్ రాయలసీమ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఇం దులో భాగంగా టిడిపి నాయకులు స్థానిక ఐటిఐ కాలేజీ, షిరిడీ సాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మిషన్ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నరేష్‌యాదవ్, మీడియా కోఆర్డినేటర్ సురేంద్రయాదవ్, నరేంద్ర రాయల్, బండారు బాలకృష్ణ, మణిశేఖర్‌రెడ్డి, భరత్, ఆగిసం కార్తీక్ పాల్గొన్నారు.

చిలమత్తూరు ఎంపిడిఒగా నరేష్ క్రిష్ణ

చిలమత్తూరు : చిలమత్తూరు ఎంపిడిఒగా నరేష్‌క్రిష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచులు లక్ష్మీపతిరెడ్డి, బయపరెడ్డి, తిరుమలేష్ తదితరులు నూతన ఎంపిడిఒకు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు సర్వసభ్య సమావేశం

రొళ్ల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శు క్రవారం(నేడు) ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమా వేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆజాద్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని సూచించారు.

6న పర్యావరణ జాతీయ కవితోత్సవం

పెనుకొండ :జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీ హిందూపురం పట్టణంలో 'పర్యావరణ జాతీయ కవితోత్సవం'ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, నిర్వాహ కులు ఉమర్‌ఫారూక్‌ఖాన్ తెలిపారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయం గా సమాజాన్ని జాగృతం చేయడానికి జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో వంద మంది కవులు, 10 మంది విశిష్ఠ అతిథులు పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న కవులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

లోపాలు లేని ఓటర్ల జాబితాకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024 కార్యక్రమాన్ని విజయవంతంగా ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా నిర్వహించి పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5న ప్రచురించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తహశీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో నరేంద్ర కుమార్ లతో కలసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ హసీనా సుల్తానా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుని మృతికి ఎమ్మెల్యే సంతాపం

మడకశిర : పట్టణానికి చెందిన టిడిపి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పరమేష్ మామ, సీనియర్ నాయకులు నాగరాజు (55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఈ విషయం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ప్రకాష్, మాజీ ఎంపిపిలు ఆదినారాయణ, అశ్వత్థప్ప గురువారం ఉదయం వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి సంతాపం తెలిపారు. వారి వెంట క్రిష్టప్ప, రమేష్, శ్రీనివాసులు, నరేష్, దేవా, శంకరప్ప, తదితరులు ఉన్నారు.



నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరన్న

వైఎస్ఆర్ కాలనీలో 1100 మందికి ఇళ్ల పట్టాలు

'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంకర నారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

పేదలందరికీ పక్కా ఇల్లు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో 1100 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 6, 7వ వార్డుల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్‌ఫరూక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దర్గా రోడ్డు, సౌదాఘర్ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు నీటి సమస్యలను, మరి కొందరు ఇళ్ల స్థలాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. అలాగే పెనుకొండ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో 1100 పట్టాలు పంపిణీ చేయగా అందులో 700 ప్లాట్లను ముస్లిం మైనారిటీల కు పంపిణీ చేశామన్నారు. ఇంకా కొందరికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని, ఇళ్ల స్థలాలు లేని ప్రతి ఒక్కరూ సచివాల యంలో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, ఎంపిడిఒ శివశంకరప్ప, నగర పంచాయితీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, వైస్ ఛైర్‌పర్సన్లు జయారెడ్డి, సునీల్, ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహా, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, గణేష్, బోయ బాబు, శ్రీరాములు, తయూబ్, యాసిన్, సద్దాం, ఫరీద్, క్రిష్టప్ప, రామాంజి, భాస్కర్ నాయక్, మారుతి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



లేపాక్షిలో ప్రజలకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపికవేణు

లేపాక్షి : ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి సర్కార్ అని హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపికవేణు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సచివాలయం -3లో గురువారం సర్పంచి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సిఎం జగన్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించార న్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఎంపిడిఒ నరసింహనాయుడు, తహశీల్దార్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, నాయకురాలు మధుమతి, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండల పరిధిలోని ఆర్.లోచర్ల సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం లో ఎంపిపి చంద్రశేఖర్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేం ద్రంలోని అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్ర మం పూర్తి చేసినట్లు తెలిపారు. అన్ని సచివాలయాల్లో మొత్తం 12వేల వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎ రవిశేఖ ర్‌రెడ్డి, రాజారెడ్డి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, ఈఓఆర్‌డి కేశవరెడ్డి, సర్పంచులు గంగాధర్, సోమిరెడ్డి, సిద్ధు, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

బత్తలపల్లి : సచివాలయాలు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తోందని ఎంపిపి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. గురువారం మండలంలోని ఓబుళాపురం గ్రామ సచివాలయ ఆవరణంలో సర్పంచు సరస్వతి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా వారితో పాటు ఎంపీడీవో సౌజన్యకుమారి. సీఎస్టీ శారద. ఈ దివాకర్, ఎంపీటీసీ బండి రాములమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకం కావాలంటే మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ప్రజల వద్దకే పథకాలు వస్తున్నాయని. ఇవి కానసాగాలంటే మరోసారి వైసిపిని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పద్మావతి, విఆర్ఓ కుళ్లాయప్ప, వైసిపి నాయకులు వీరనారప్ప, నారాయణస్వామి, నాగభూషణ, ఆదినారాయణ, డీలర్ శ్రీనివాసులు సోమశేఖర్, పెదయ్య నాగన్న తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒ శ్రీనివాసభాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించండి

మడకశిర : పట్టణంలోని ఆరేపేట 11వ వార్డులో ఉన్న ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించా లని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఇఓ శ్రీనివాసభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, తదితరులు పాల్గొన్నారు .

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జికి చంద్రబాబు అభినందనలు

మడకశిర : టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు తన పరిధి పార్టీకి సంబంధించిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా నిర్వహించినం దుకు పార్టీ అధినేత చంద్రబాబు గురువారం విజయవాడలో అభినందించా రు. అలాగే సర్పంచి గంగమ్మ నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు ఆయనకు సూచించారు.



నాగరాజును అభినందిస్తున్న చంద్రబాబు

గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని యనమల పల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా గ్రీన్ భారత్ ఫౌండర్ రెడ్డి వారి శంకరనారాయణ, మండల విద్యాధికారి ప్రసాద్, గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకటరత్నం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత తదితరులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతి విద్యార్థి పర్యావరణాన్ని పరిరక్షించాలని మొక్కలను విరివిగా పెంచాలని కోరారు. అందుకోసం గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో మొక్కలను ఉచితంగా అందజేస్తామని, వాటిని మీ గ్రామాల్లో, నివాసాల ముందు మీ తోటల్లో పెంచుకోవాలని సూచించారు.

పక్కాగా ఇంటింటి సర్వే : డిఆర్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పెషల్ సమ్మర్ రివిజన్‌కు సంబం ధించి చేపడుతున్న ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల ప్రతినిధు లు సహకరించాలని డిఆర్ఒ కొండయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోనితన ఛాంబర్ లో ఇంటింటి సర్వే పై రాజకీయ పార్టీల నాయకుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ 2024 కు సంబంధించి ఈనెల 21 నుంచి ఇంటింటి సర్వే జరుగుతుంద ని షెడ్యూల్ ప్రకారం బూత్ లెవెల్ అధికారులు ఈ సర్వే చేపట్టారని అన్నారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. బిఎల్ఒ లు ఇంటింటికి సర్వే కి వెళ్తున్నారా లేదా అనేది పరిశీలించాలన్నా రు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెంది న ఏజెంట్లు సర్వేలో పాల్గొనాలన్నారు. పార్టీల నాయకులు బూత్ లెవెల్‌లో ఏజెంట్లను నియమించాలన్నారు. ఎన్నికల ఓటర్ జాబితాకు సంబంధించి సర్వేపై ఫిర్యాదులు ఉంటే 1950 టోల్‌ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చున్నారు. ఆగస్టు 1 నుంచి టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుంద న్నారు. ఓటు హక్కు నమోదుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నా రు. చేర్పులు మార్పులు తొలగింపులపై రాజకీ య పార్టీలు పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇంటింటి సర్వే పారదర్శకంగా జరగాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ఇఎస్ వెంకటేష్, వైసిపి ప్రతినిధి బీడుపల్లి రంగారెడ్డి, టిడిపి ప్రతినిధి విజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అల్లా బకాష్, బహుజన పార్టీ సుబ్బారాయుడు, బిజెపి ప్రతినిధి ఓబులేసు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైముద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు పరిశీలన

ప్రజాశక్తి-రొళ్ల



ఓటరు సర్వేలో పాల్గొన్న బిఎల్ఒలు, టిడిపి నాయకులు

మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. మల్లిన మడుగు పంచాయతీలో జరుగుతున్న ఓటరు పరిశీలనలో భాగంగా గురువారం బూత్ నెం-104 హెచ్‌టి హళ్లి, వడ్డెర హట్టి, బూత్ నెం:106 కాలువేపల్లిలో బిఎల్ఒలు, స్థానిక బూత్ ఇన్‌ఛార్జి ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు పక్రియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా వారు ఓటర్లతో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు కార్డులో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు కూడా అవకాశం ఉందన్నారు. మండలంలో ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుంద ని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దాసిరెడ్డి, టిఎన్‌టి యుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి, ఆర్టిఎస్ కోర్డినేటర్ రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్, యూనిట్ ఇన్‌ఛార్జి యంజారప్ప, బూత్ ఇన్‌ఛార్జులు నారాయణప్ప, సతీష్, ఈరన్న, నాయకులు రంగనాథప్ప పాల్గొన్నారు.